మూలుగుతున్నాయో వాళ్ళ భావాలన్నీ ! యింతటి రుషులూ, శమ దమయుతులు, యీశ్వర దయాసంపన్నులు, వీళ్ళుకూడా నూతన సంస్కారమూ, నిర్మలకాంత్రిప్రవేశము అనేటప్పటికి ప్రపంచక్షోభ సంభవించినట్లు అదిరి పడతారు ఆలోచనలేకండా.

శశాంకుడు

గురువుగారు వారి భావాల్ని ప్రచారం చెయ్యరు. యితరుల మానసాలకు అతీతముకదా యీ వుత్తమజ్ఞానబోధ; ఆ కాంతి అల్ప మేధాదృష్టిగల సామాన్యుల్ని అంధుల్ని చెయ్యదా అని భయము కాబోలు. అందువల్ల ఆయనకి ప్రపంచతృణీకారభావం హెచ్చని వాదు పడ్డది. కాని గురుపుగార్ని యిన్నాళ్ళూ శుశ్రూషచేసి పొందిన మహోన్నత విజ్ఞాన సంపదకి ప్రతిఫలం నేనే యివ్వగలను ? యీయన స్వప్నాలుకని ప్రచారం చెయ్యలేని యీ ఆదర్శాల్ని నా రాజ్యంలో శాశ్వతంగా నెలకొల్పుతాను.

(అనూరాధ వుత్సాహంగా వొచ్చింది.)

అనూరాధ

యింక రాలేదే !

శశాంకుడు

అప్పుడే వొచ్చావే !

అనూరాధ

(వుత్సాహ రహితంగా) యెంతవరకు చదివావు ?

శశాంకుడు

ఒక్కరవ్వకూడా . . .

అనూరాధ

యేం ?

(ఆలోచనలో పడ్డది)
నగలన్నీ తీసేసి స్నానానికి వెళ్ళబోయ్యేదానివలె నుంచున్నావు.
కదలవేం! చూడు. వాయు వెట్లా నిరాశపొంది నిన్నువొదిలి వెళ్ళి
పోతున్నాడో ఆ కౌముది దగ్గిరికి! నా మీదనే యీ కోపమంతా!
ఎందుకు? పొద్దున్నేవచ్చి నీ శోభ చూడలేదనా? పొద్దున్న శశి
వెళ్ళిపోయినాడు మరి!
(ఎక్కువ దిగులుపడుతో మాట్లాడుతోంది.)
మళ్లీ మళ్లీ శశి లేడని జ్ఞాపకమొచ్చి బాధపెడుతోంది మనసు
(విచారమెక్కువవై వెన్నెలవేపుతిరిగి పాడుతోంది)
ఏం చెయ్యను? నిద్రైనారాదు. ఒక్కొక్కటే ఈ పిచ్చిమొక్కలు నిద్ర
పోతున్నాయి. నన్నూ నాదుఃఖాన్నీ ఈవెన్నెలకి వొంటరిగా వొదిలి.
(మళ్లీ వెన్నెల్లో పాడుతో నుంచుంది. విచారభారం ఎక్కు
వయింది. చప్పున తెల్లగా పిచ్చిగాపూసిన కామిని పొదని
కావిలించుకుని మొహం ఆ పూలలో అద్దుకుంటో మాట్లాడు
తోంది)
కామినీ! కామినీ! శశి వెళ్ళిపోయినాడు. నాకేం తోస్తుంది!
నీకు తెలుసునా వెళిపోయినాడని? యిట్లానే వెళ్లాడు. నిద్రతో
అలసటతో మూతలుపడే కళ్ళతో; సిగ్గుతో, భయంతో, వేళ్లాడే
ముఖంతో; తామరకాడవలె వొడిలిపోయిన శరీరంతో; మీవంక
నన్నా కన్నెత్తి చూడక వెళ్లాడు....యింక నేనేంచెయ్యను? నాకేం
తోస్తుంది? పొద్దున్నే గోరింట "శశే నాకు నీళ్లుపొయ్యాలంటే"
నేనేంచెప్పను? శశి నవ్వు వినపడకండా మీరందరూ బతుకుతారా?
మీ ఆకుల్లోంచి కలకలమని పరుగులెత్తే ఆ నవ్వు: యీ ఆశ్రమం
శవంలాగు వేళ్ళాడుతోందే! యీ వెన్నెల శవంమీది వస్త్రంలాగు
పరుచుకుందే!....నువ్వూ నిద్రపోతున్నావా? లేదు. యింకా దగ్గిరిగా

విశ్వామిత్రుడు

అహల్య పతివ్రత అయింది.

బృహస్పతి

పాషాణి అయింది.

విశ్వామిత్రుడు

దుర్మార్గులు వారి పాపకార్యాలు మాననీ, మానకపోనీ, మనం మన విధ్యుక్తధర్మం నెరవేర్చితీరాలి.

బృహస్పతి

విధ్యుక్తధర్మం ఏమిటి ?

విశ్వామిత్రుడు

దండన.

బృహస్పతి

శమదమన్వితుడివైన ఋషివా దండధారివైన యముడివా ?

దేవేంద్రుడు

లోకోపకారార్థం, సంఘ పారిశుద్ధ్యంకోసం తమరు శిక్షించితీరాలి.

బృహస్పతి

శిక్షవల్ల లోకోపకారం ఎన్నడన్నా జరుగుతుందా ? కాకులకు యీక కట్టినట్లు, లోకభయంకరార్థం, వీళ్ళద్దరి పీనుగుల్ని నా గుమ్మానికి వేళ్ళాడకట్టనా ! మీ కళ్ళకెవరు శిక్షార్హులో వాళ్లు నాకు ప్రేమపాశ బంధితులు.

విశ్వామిత్రుడు

చ్ఛాలా విశ్వాసం కనపరిచారు నీపైన !

గౌతముడు

అన్యాయం, అన్యాయం.

విశ్వామిత్రుడు

ఎందుకులే : ఈ విషయం ఎంత కొంచంగా ప్రస్తావిస్తే అంత మంచిది. కర్తవ్యమాలోచించండి. ఈ సంసారాన్ని యీ స్థితిలో వొదిలి వెళ్లామా, మహాక్షోభ సంభవిస్తుంది. ఇతని పాండిత్యాన్నీ అద్భుతమహిమనూ చూసి, భ్రమిసి, రాక్షసులమీద పై ఎత్తుగా, తీరా దేవగురువును చేసుకుని, యితని ఆచార్యత్వం వొప్పుకుంటిమి, ఇంక ఋషులన్నా, ఋషులభార్యలన్నా పరియాచకంకింద తేలుతుంది.

గౌతముడు

ఇట్లాంటివి ఎన్ని జరుగుతున్నాయికావు. పోనిద్దూ పోదాం.

విశ్వామిత్రుడు

అది కాదయ్యా! పాపం లేకపోలేదు. పాపాత్ములు పాపాత్ములమని వొప్పుకుంటారు. పోనీ యితరులనన్నా ఖండిస్తారు, తమను సమర్థించుకున్నా. కాని యితడు తన భార్యచర్య సక్రమమని లోకానికంతా ఋజువుచేసేట్టున్నాడు.

దేవేంద్రుడు

అట్లాకాదు. ఎట్లానన్నా వీళ్ళిద్దరి సంబంధం తప్పించాలి.

గౌతముడు

ఎట్లా ? తను శిక్షించడు. యితరులను గడప తొక్కనీడు.

విశ్వామిత్రుడు

నిజం. ఈ ఆశ్రమ మహిమ చూశావా ? మన తేజం యెంత కొరతపడుతోందో యిక్కడ !

